

# తగ్గేదేలేదు..

## బకాయిలు చెల్లిస్తేనే.. పనిచేస్తాం

- మాన్‌సూన్, ఐఆర్టీ వర్క్‌లు చేయం
- ప్రస్తుతం చేస్తున్న నిర్వహణ పనులన్నీ నిలిపివేశాం
- రూ.1350 కోట్ల బకాయిలు చెల్లించే వరకు మా నిరసన ఆగదు
- బడా కాంట్రాక్టర్లకైతే లోన్లు తెచ్చి ఇస్తున్నారు..
- మాకైతే ఆగమంటున్నారు
- పనులు బంద్ పెట్టి.. నిరసనకు దిగిన జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు

సిటీబ్యూరో, మే 18, (నమస్తే తెలంగాణ) : మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం...మరో వైపు గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ..దీనికి తోడు జీహెచ్ఎంసీలో కాంట్రాక్టర్లంతా పనులను ఎక్కడికక్కడ నిలిపివేసి.. సమ్మె సైరన్ మోగించారు. దీంతో జీహెచ్ఎంసీలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లు, డ్రైనేజీలు, నాలాలు, కరెంట్ పోల్స్, పార్కులు, ప్లే గ్రౌండ్, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇలా మెయింటెనెన్స్ పనులు చేపట్టే కాంట్రాక్టర్లంతా పనులు నిలిపివేసి శనివారం నుంచి బంద్‌లోకి దిగారు. రూ. 1350 కోట్ల బకాయిలు చెల్లించే వరకు మా నిరసన ఆగదంటూ బల్దియాకు అల్టిమేటం జారీ చేశారు. తొలి రోజు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. 'వీ వాంట్ పేమెంట్స్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. 'ఎవరినీ కష్టపెట్టడం మా ఉద్దేశం కాదు...బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చి, చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థిక సుడిగుండంలో చిక్కుకుని బతకలేని పరిస్థితిలో ఉన్నాం' అంటూ కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల చదువులకు డబ్బులు లేక, వర్కర్లకు ఈపీఎఫ్, బ్యాంకులకు ఈఎంఐలు కట్టలేకపోతున్నామని, ఆర్థిక బాధలతో సడెన్ స్ట్రోక్‌లకు గురై ప్రాణాలు పోతున్న పరిస్థితులు వచ్చాయని అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ. రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నెలన్నర రోజుల కిందటే కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి పరిస్థితిని వివరించామని, ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదని, అందుకే నిరసన బాట పట్టామని చెప్పారు. సీఆర్ఎంపీ, ఎస్ఆర్‌డీపీ వంటి ప్రాజెక్టులు చేస్తున్న బడా కాంట్రాక్టర్లకు బ్యాంకుల నుంచి లోన్లు తెచ్చి మరీ ఇస్తున్నారని, మా లాంటి చిన్న కాంట్రాక్టర్లను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

'మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేసినా.. మేం తలొగ్గేదే లేదు' అవసరమైతే రానున్న రోజుల్లో ఇప్పుడు చేస్తున్న పనులే కాక వర్షాకాలం సంబంధించిన ఐఆర్టీ, మాన్‌సూన్ పనుల టెండర్లలో పాల్గొనబోమని రామకృష్ణారెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు. తమ బకాయిలు చెల్లిస్తేనే పనులు జరుపుతామని, రానున్న రోజుల్లో నిరసనను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గడిచిన కొద్ది రోజులుగా కాంట్రాక్టర్లు బంద్‌లోకి వెళ్తామని సమాచారం ఇచ్చినా, స్వయంగా బంద్‌లోకి వెళ్లినా.. కమిషనర్ మాత్రం వారికి ఎలాంటి భరోసా ఇవ్వకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### అది ట్రయల్ రన్ మాత్రమే..

# మెట్రో వేళల్లో మార్పు లేదు



సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ) : మెట్రో సమయాలను పొడిగిస్తారనే ఆశలపై హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ నీళ్లు చల్లింది. మెట్రో సమయాల్లో ఎలాంటి పొడిగింపు లేదని ఓ ప్రకటనలో అధికారులు తెలిపారు. సోమ (ఉదయం 5.30), శుక్రవారం (రాత్రి 11.45 గంటలకు) జరిగినది కేవలం ట్రయల్ రన్ మాత్రమేనని, పలు పరిశీలనల తర్వాతే ఆ వేళలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. అప్పటివరకు యధావిధిగానే ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయన్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి సేవలను పొడిగిస్తామన్నారు. పూర్తిస్థాయిలో అధ్యయనం తర్వాతే సమయాలపై స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు.

# టీఎస్ స్థానంలో 'టీజీ'

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వికారాబాద్, మే 18 : తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్ బదులుగా టీజీగా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీవోలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్‌హెడ్‌లు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, స్వయం ప్రతిపత్తిగల సంస్థలు, అధికారిక కమ్యూనికేషన్లలో తెలంగాణ కోడ్ టీఎస్‌కు బదులుగా టీజీ వినియోగించాలని ఆదేశించారు. తెలంగాణలో ఇప్పటివరకు వాహనాల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితమైన టీజీ నిబంధన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అధికారిక వ్యవహారాలకు వర్తింపజేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, తక్షణమే ఇది అమల్లోకి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఇకపైన 'టీఎస్' స్థానంలో అధికారికంగా 'టీజీ' అని మార్చుకునేలా మే 30 తేదీ డేడ్ లైన్‌గా ఉందని, ఇది రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికీ వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ శాఖల ద్వారా నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాల్లో టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలన్నారు. అన్ని కార్యాలయాల్లో టీఎస్‌కు బదులు టీజీగా మార్చుతూ మే 26వ తేదీ లోగా నివేదికలు సమర్పించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు.

## విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

షాబాద్, మే 18: పాఠశాలలు పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందించేలా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అర్బన్, యూఎల్‌బీ, జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారి సైజుల ప్రకారం డ్రెస్సులను కుట్టించాలన్నారు. జూన్ 7 నాటికి ఒక జత దుస్తులు కచ్చితంగా అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్డీవో పీడీ శ్రీలత, మెప్మా పీడీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



- వచ్చి ఐదు నెలలైనా పైసా విదల్చని కాంగ్రెస్ ప్రభుత్వం
- నిధుల్లేక పంచాయతీల్లో పేరుకుపోతున్న సమస్యలు
- ఆరేడు నెలలుగా పంచాయతీ సిబ్బందికి అందని జీతాలు
- నిలిచిన తడి-పొడి చెత్త సేకరణ ప్రక్రియ
- ఎక్కడా చూసిన చెత్తాచెదారమే..
- ట్రాక్టర్లకు ఈఎంఐలు కట్టలేని దుస్థితి

మారిన పల్లెచిత్రం

# నిన్న ప్రగతి.. నేడు అధోగతి..



వికారాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ హయాంలో స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా రూపుదిద్దుకున్న పల్లెల్లో పాలన పడకేసింది. పల్లెప్రగతి కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చి దేశంలో ఎక్కడాలేని విధంగా పచ్చని పల్లెలుగా తీర్చిదిద్ది అవార్డులను సొంతం చేసుకున్న గ్రామ పంచాయతీల్లో గత ఐదారు నెలలుగా పాలన అస్తవ్యస్తమైనది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా విదల్చకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొన్నది. ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తూ కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై ఇప్పటివరకు ప్రస్తావించకపోవడం గమనార్హం. కేసీఆర్ హయాంలో జీపీలు దేశంలోనే ఆదర్శం కాగా.. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో వాటి పరిస్థితి అధ్వానంగా మారింది. జిల్లాలోని చిన్న గ్రామ పంచాయతీల్లో వాటి పరిస్థితి మరి దారుణంగా మారింది. ఆ జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు గత 6 నెలలుగా జీతాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుధ్యం దారుణంగా తయారైంది. డబ్బుల్లేక డ్రైనేజీ పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు జరుగడంలేదు. అంతేకాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికీ ఇచ్చిన ట్రాక్టర్లు ప్రస్తుతం మూలనపడ్డాయి. ట్రాక్టర్లకు ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితితోపాటు ట్రాక్టర్లను నడిపేందు కు డీజిల్‌ను కొనేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. ట్రాక్టర్లు మూలనపడడంతో ప్రతిరోజూ ఇంటిం టి నుంచి సేకరించే తడి-పొడి చెత్త ప్రక్రియ కూడా నిలిచిపోయింది. దీంతో గ్రామాల్లో ఎక్కడా చూసిన చెత్తాచెదారం దర్శనమిస్తున్నది. కొన్ని గ్రామ పంచాయతీల్లో నిధుల సమస్యతో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని దుస్థితి నెలకొన్నది.

### పైసా విదల్చని ప్రభుత్వం..



పంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపుతున్నది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పైసా కూడా విదల్చలేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేక ప్రత్యేక అధికారులు ఇబ్బందిపడుతున్నారు. మౌలిక వసతులు సరిగ్గాలేక ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. వేతనాలు అందక చిన్న ఉద్యోగులు అలమటిస్తున్నారు.

**– కందనెల్లి వెంకటేశ్, ఎన్కేపల్లి, యాలాల**

### పాలన పడకేసింది..



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదు నెలలైనా రూపాయి కూడా కేటాయించకపోవడంతో గ్రామాల్లో పాలన పడకేసింది. మౌలిక వసతులు కల్పించేందుకు నిధుల్లేక అధికారు లు ఇబ్బందిపడుతున్నారు. పంచాయతీ కార్మికులు, సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో వారు బయట అప్పులు తెచ్చుకుని బతుకు బండిని లాగిస్తున్నారు. ఇకనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పంచాయతీలకు వెంటనే నిధులు కేటాయించి ఆదుకోవాలి.

**– వడ్డె వెంకట్‌రాములు, మోత్కూర్, దోమ**

### ప్రశ్నార్థకంగా గ్రామాల అభివృద్ధి



కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో వాటి అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. నిధుల్లేక ప్రజలకు మౌలిక వసతులు సమకూరడం లేదు. మంచినీటిని సరఫరా చేసే బోరు మోటర్లు కాలిపోతే మరమ్మతులు చేయించేందుకు అధికారులు గ్రామ పెద్దలను బతిమిలాడే పరిస్థితి వచ్చింది. అత్యవసర పనులకు అధికారులు అప్పులు చేయాల్సి వస్తున్నది.

**– కృష్ణ, మంతట్టి గ్రామం బషీరాబాద్**



### చెత్త సేకరణ జరుగడం లేదు..



గత నాలుగైదు నెలలుగా గ్రామంలో చెత్త సేకరణ జరుగడం లేదు. అధికారులను సంప్రదిస్తే పంచాయతీలో నిధుల్లేవు రాగానే పనులను ప్రారంభిస్తామని చెబుతు న్నారు. దీంతో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి పరిశుభ్రత లోపిస్తు న్నది. వీధిలైట్ల కోసం ప్రత్యేకాధికారిని కలిస్తే సరిపడా కాకుండా ఒకటి, రెండు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. లైట్లను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్తులం సొంతంగా డబ్బు వెచ్చించాల్సి వస్తున్నది.

**–శ్రీధర్‌రెడ్డి, బషీరాబాద్**

### సంక్షోభంలో పంచాయతీలు..



నిధుల్లేక గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది. తాగునీటి కోసం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాల్వల మ్యాన్‌హోల్ మూతలు పగిలి ప్రమాదకరంగా మారాయి. రాత్రివేళల్లో వీధిలైట్లు వెలుగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించలేని దుస్థితి. ఒకవైపు పాలకవర్గాలు లేక, ఇంకోవైపు నిధులు లేక పంచాయతీలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

**– రవీందర్, కంకల్ గ్రామం, పూడూరు మండలం**

### నిధులను కేటాయించాలి



నిధుల్లేక పంచాయతీల్లో పనులు పెండింగ్‌లో పడ్డాయి. దీంతో ఎక్కడికక్కడే సమస్య లు పేరుకుపోతున్నాయి. సమస్యలు పరిష్కారం కావాలంటే నిధులను త్వరగా విడుదల చేయాలి. గత బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా విధులయ్యే నిధులతో గ్రామ పంచాయతీల్లో అన్ని పనులు పూర్తి అయ్యేవి. రేవంత్ ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

**– రవీనాయక్, గోగ్యానాయక్‌తండా, కులకచర్ల**

### జీపీలకు అరకొర నిధులు..



సిబ్బంది జీతాలు, పారిశుధ్యం, వీధిదీపాలు, నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిధులను కేటాయించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి నత్తనడకన సాగుతున్నది. 15వ ఆర్థిక సంవత్సర నిధుల విడుదల తర్వాత ఇంతవరకూ నిధుల కేటాయింపే జరుగలేదు. ప్రజలకు మౌలిక వసతులను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలి.

**– బొంగలి రమేశ్, కోకట్, యాలాల**



శంకర్‌పల్లిలో రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్





వరద నీటితో అవస్థలు పడుతున్న ద్విచక్రవాహనదారులు



# దంచికొట్టిన వర్షం

### ట్రాఫిక్ జామ్.. ఇబ్బందులు పడిన వాహనదారులు

శంకర్‌పల్లి మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లపై వర్షపు నీరు నిలువడం, పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- షాబాద్, మే 18



వరద నీటిలో నుంచి వెళ్తున్న వాహనాలు